క్లుప్తంగా

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి



దహెగాం: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

దహెగాం: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంబగౌని సులోచన కోరారు. మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తారని పేర్కొన్నారు. సర్పంచ్ అమృత, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని అంబరావుగూడలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పెందోర్ మోతిరాం ప్రారంభించారు. ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ గుణవంత్‌రావు తదితరులున్నారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా ఉండాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆసిఫాబాద్‌రూరల్: తప్పులు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలో పర్స నంబాల గ్రామంలో ఓటరు జాబితా వివరాలను గురువారం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఓటర్లలో అందరు ఉన్నారా లేదా? వేరే చోట ఉంటున్నారా?తప్పుగా నమోదైందా అన్న వివరాలను ఆర్ఐ బీర్షా, బీఎల్‌వో కలిసి తెలుసుకున్నారు. తప్పులున్నా వారికి ఆధార్ పరిశీలించి ఫారం 8 ద్వారా ఓటరు జాబితాలో సవరించాలని సూచించారు.

కొనసాగిన వీవోఏల సమ్మె



సమ్మె చేస్తున్న వీవోఏలు

కౌటాల: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. గురువారం నాటికి 25వ రోజు సమ్మె చేరింది. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు మాట్లాడుతూ ప్రభుత్వం వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైనవారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. రూ. 26వేలు వేతనం చెల్లించాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, వీవోఏలు రవి, ఆనంద్, దేవాజీ, శంకర్, మహేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో గౌసియా బేగం

పెంచికల్‌పేట్: నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని చేడ్వాయి ఏఈవో గౌసియా బేగం అన్నారు. మండలంలోని దరోగపల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు రసీదులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయశాఖ అధికారుల సమాచారం అందించాలన్నారు. ఆయిల్‌పాం పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో హోలి ట్రినిటీ పాఠశాలలో పదో తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు గురువారం అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు కలేనా !

- మైదానం లేక క్రీడాకారుల ఇక్కట్లు
- క్రీడల్లో సాధనకు తిప్పలు
- ప్రభుత్వ స్థలం లేదంటున్న అధికారులు



మండల కేంద్రంలోని రైల్వే స్థలం

రెబ్బెన: మండల కేంద్రవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న క్రీడా మైదానం ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ఔత్సాహిక క్రీడాకారులు ఎంతో మంది ఉండగా సాధన చేసేందుకు మైదానం లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో పొలాలు, చేళ్లు, ఖాళీ ప్రదేశాలను క్రీడాకారులు మైదానాలుగా తయారు చేసుకుని సాధన చేస్తున్నారు. వేసవి సెలవులతో పాఠశాలల విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ స్థలం లేదని సాకుతో అధికారులు మైదానం ఏర్పాటు చేయడం లేదు. అటు ఉదయం పూట వాకింగ్ చేసే పెద్దలు రోడ్డు వెంట వెళ్లాల్సి వస్తోంది. ఆ సమయంలో వాహనాలు ఢీకొని వాకర్లు ప్రమాదాల బారిన సంఘటనలున్నాయి.

రెబ్బెనలో..

రెబ్బెనలో దాదాపు 2 వేల జనాభా ఉంటుంది. యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు మండల కేంద్రంలో క్రీడామైదానం ఏర్పాటు చేయాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్ర పర్యటనకు వచ్చే పాలకులు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా అవి చెత్త బుట్టల పాలవుతున్నాయే తప్పా మైదానం ఏర్పాటు శ్రీకారం పడటం లేదు.

ఖాళీగా రైల్వేస్థలం..

మండల కేంద్రంలో రైల్వేశాఖకు చెందిన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నా ఏమాత్రం ఉపయోగపడడం లేదు. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి గంగాపూర్ కమాన్ వరకు దాదాపు పదెకరాల వరకు రైల్వేశాఖకు చెందిన ఖాళీ స్థలం నిరుపయోగంగా పడి ఉంటోంది. భవిష్యత్తు అవసరాల కోసం రైల్వేశాఖ స్థలాన్ని అందుబాటులో ఉంచుకుంది. మండల కేంద్రం నడిఒడ్డున ఖాళీగా ఉన్న రైల్వే స్థలాన్ని క్రీడా మైదానం కోసం కేటాయించాలని మండల వాసులు రైల్వే జీఎం దృష్టికి సైతం తీసుకెళ్లారు. రైల్వేస్టేషన్ల సందర్శనకు వచ్చిన ప్రతిసారి వినతిపత్రాలు అందజేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. క్రీడలపై ఉన్న మక్కువతో కొందరు క్రీడాకారులు రైల్వేస్థలంలో ఒక మూలన వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసుకుని సాధన చేస్తున్నారు. అదే పూర్తిస్థాయిలో మైదానం కోసం ఆ స్థలాన్ని కేటాయిస్తే క్రీడాకారులతోపాటు వాకర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల వాసులు కోరుతున్నారు.

రైల్వేస్థలం కేటాయించాలి



మండల కేంద్రంలో రైల్వేశాఖకు చెందిన స్థలం ఉంది. అందుబాటులో ఉన్న రైల్వే స్థలాన్ని క్రీడామైదానం ఏర్పాటుకు కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– సుదర్శన్‌గౌడ్, రెబ్బెన

పొలాలు ఖాళీ ప్రదేశాలే దిక్కు



ఎప్పుడైన ఏదైనా ఆటలు ఆడాలంటే మండల కేంద్రం లోని క్రీడాకారులకు పొలాలు, ఖాళీ ప్రదేశాలే దిక్కవుతున్నాయి. స్థలం అందుబాటులో లేదనే సాకుతో అధికారులు మైదానం ఏర్పాటుకు కృషి చేయడం లేదు. రైల్వే స్థలాన్ని మైదానం కోసం కేటాయించాలని రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించాం. – వినోద్ జైస్వాల్, రెబ్బెన

రోడ్ల వెంబడే వాకింగ్



ఉదయం పూట వాకింగ్ చేసేందుకు అనువైన స్థలం లేక రోడ్ల వెంటనే వాకింగ్ చేయాల్సి వస్తోంది. కొందరు రహదారుల వెంట వాకింగ్ చేస్తుండగా మరికొంత మంది రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వెంట చేయాల్సి వస్తోంది.
– శంకర్, రెబ్బెన

టీవీలు ఇచ్చారు.. విద్యుత్ మరిచారు!



ఎస్సీ కాలనీలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం

- ఆదర్శ కేంద్రాల్లో కరెంట్ సౌకర్యం కరువు
- ఐదు నెలలుగా నిరుపయోగంగా టీవీలు

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా మార్చి చిన్నారులకు నూతన ఒరవడిని కల్పిద్దామని చేసిన ప్రయత్నం మంచిదే! అయినప్పటికి సౌకర్యాల కల్పనలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఆదర్శ కేంద్రాలను నూతన హంగుల్లో తీర్చిదిద్దారు. రంగు రంగుల బొమ్మలను గోడలపై పేయింటింగ్ చేశారు. వివిధ రకాల జంతువులు, జీవరాశులను గీశారు. అలాగే ఆట వస్తువులను సైతం అందించారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల్లో చిన్నారులకు ప్రీస్కూల్ కార్యక్రమాలను టెలివిజన్ల ద్వారా అందించేందుకు టీవీలను సైతం మంజూరు చేసినప్పటికి కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అవి నిరుపయోగమవుతున్నాయి.

37 ఆదర్శ కేంద్రాలు...

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నాలుగు కస్టర్లు ఉన్నాయి. వాటిలో 87 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రభుత్వ భవనాలు కలిగిన 37 కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. వాటిలో కెరమెరి–2, చందుగూడ, సుల్తాన్‌గూడ, అనారపల్లి, దేవాపూర్, లక్మాపూర్, రింగన్‌ఘాట్, కెలికే, కెలిబి, సాంగ్వి–2 కేంద్రాలకు టెలివిజన్లు మంజూరయ్యాయి. కాని ఆ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆ టీవీలు నిరుపయోగంగా మారాయి. ఒక్కో టీవీ సుమారు రూ. 20 వేలకు పైగానే ఉంటుంది. ఈ లెక్కన 10 కేంద్రాల్లో రూ. 2 లక్షలు నిరుపయోగమైనట్లు తెలుస్తోంది. ఆయా కేంద్రాల్లో చక్కగా అమర్చి ఉన్నప్పటికి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. కాగా కొన్ని కేంద్రాలకు అతి సమీపంలో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికి మీటరు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారు. అయితే విద్యుత్ కనెక్షన్ గ్రామ పంచాయతీ వారు ఇచ్చుకోవాల్సి ఉంది. కాని ఎవరూ పట్టించుకోవడం లేదు. టీవీలు కలిగిన పది కేంద్రాల్లో సుమారు 322 పూర్వ ప్రాథమిక విద్యార్థులు ఉన్నారు.

అభినయ గేయాలు

ఆదర్శ కేంద్రాల్లోని ప్రీస్కూల్ చిన్నారులు ఆటలు ఆడడంతో పాటు టెలివిజన్‌లో గేయాలు, అభినయ గేయాలు వీక్షించాల్సి ఉంది. పూర్వ ప్రాథమిక విద్యార్థులు మంచి అలవాట్లు, సంభాషణ, కథలు, సంసిద్ధత, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, నృత్యాలు తదితర అంశాలను టీవీ ద్వారా వీక్షించి నేర్చుకోవాల్సి ఉంది. కాని ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేకపోవడంతో టీవీలు అక్కరకు రాకుండా పోయాయి.

పంచాయతీ ద్వారానే విద్యుత్ సరఫరా

ఆదర్శ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేని విషయం వాస్తవమే. ఈ విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆయా కేంద్రాల్లో గ్రామ పంచాయతీ సర్పంచులు విద్యుత్ సరఫరా కల్పించాల్సి.
– కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కెరమెరి

'పది'లో తగ్గిన ఉత్తీర్ణత



కౌటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- ఫలించని విద్యాశాఖ ప్రణాళికలు
- గతేడాది ఉత్తీర్ణత శాతం 76
- ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం 58

కౌటాల: పది ఫలితాల్లో గతేడాది కన్నా ఉత్తీర్ణత శాతం పెంచాలనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. గతంలో కన్నా ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గడంతో వారి ప్రణాళికలు ఫలించలేదు. ఈ ఏడాది డిసెంబర్ నుంచే ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేసి ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కాని ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించలేదు. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం పడిపోయాయి. 2021లో 80 శాతం ఉండగా గతేడాది 76 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 58 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 18 శాతం ఉత్తీర్ణత శాతం తగ్గడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

మండలంలో..

మండలంలో మొత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 07 ఉండగా వాటిలో 253 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు. అందులో 149 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగతా 104 మంది ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో మండల వ్యాప్తంగా ఈసారి 58 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ఫలితాల్లో బాలురదే పై చేయి..

మండలంలో పది ఫలితాల్లో బాలికల కంటే బాలురుపై చేయి సాధించారు. మండల వ్యాప్తంగా మొత్తం 132 మంది బాలురు పరీక్షలు రాయగా వారిలో 79 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 121 మంది బాలికలు పరీక్షలు రాయగా వారిలో 70 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల కంటే బాలురు 2 శాతం ఎక్కువ ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో ముత్తంపేట్ ప్రభుత్వ పాఠశాల 69 శాతం ఉత్తీర్ణత సాధించి మండల వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచింది. గుండాయిపేట్ ఉన్నత పాఠశాల 46 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా ఈసారి పది ఫలితాలు పడిపోవడంతో విద్యాశాఖ పనితీరుపై మండల వాసులు మండిపడుతున్నారు.

పర్యాటక కేంద్రంగా నాగమ్మ చెరువు

- ఎమ్మెల్యే సొంత ఖర్చులతో బుద్ధ విగ్రహం ఏర్పాటు
- మరిన్ని నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు



చెరువులో ఏర్పాటు చేస్తున్న గౌతమ బుద్ధుని విగ్రహ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు పర్యాటక కేంద్రంగా విరాజిల్లనుంది. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రంలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాగమ్మ చెరువు అభివృద్ధికి రూ. 2కోట్ల నిధులు విడుదలయ్యాయి. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంలో భాగంగా సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సొంత నిధులతో నాగమ్మ చెరువులో గౌతమ బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే నాగమ్మ చెరువులో గౌతమ బుద్ధుని విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి కానుండగా నాగమ్మ చెరువుకు పర్యాటక శోభ సంతరించుకోనుంది.

నాగమ్మ చెరువుకు ప్రత్యేక నిధులు..

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న నాగమ్మ చెరువు మినీట్యాంక్ బండ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా ప్రత్యేకంగా సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నాగమ్మ చెరువు మధ్యలో సుమారు 35అడుగుల ఎత్తు గల గౌతమ బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. నాగమ్మ చెరువు అభివృద్ధి పనులతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మరో రూ. 5కోట్ల రూపాయల నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో నాగమ్మ చెరువు అభివృద్ధికి రూ. 5కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు.

జూన్ 4న విగ్రహావిష్కరణ

నాగమ్మ చెరువులో గౌతమ బుద్ధుని విగ్రహాన్ని జూన్ 4న అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలతో ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే కోనప్ప తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రముఖులు, బుద్ధిజం భంతీజీలు హాజరవుతారని, నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

నాణ్యమైన విద్యనందించేందుకు కృషి



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌రూరల్: విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం మావల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మనఊరు.. మన బడి కింద రూ. 64లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలా, ఉప సర్పంచ్ మహేందర్ యాదవ్, జెడ్పీటీసీ నల్ల వనిత, ఎంపీడీవో అరుణ, ఎంఈవో జయశీల, ఏఈ అరుణ్, ఏఎన్, ఆసీఫ్, గంగుల కిరణ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

దహెగాం: ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. మండల స్థాయి క్రీడాపోటీలు చినరాస్పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 15, 16, 17 తేదీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 36 ఏళ్లలోపు క్రీడాకారులు తమ పేర్లను సర్పంచులు, కారోబార్లకు అందజేయాలని సూచించారు.

శిక్షణకు హాజరైన నాయకులు

బోథ్: ఏఐసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరానికి లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ బోథ్, ఖానాపూర్ సమన్వయకర్తలు పసుల చంటి, మల్లెపూల సత్యనారాయణలు హాజరయ్యారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, టీపీసీసీ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నట్లు వారు పేర్కొన్నారు.

అడుగుకో గుంత.. తీరని చింత

- అధ్వానంగా బీటీరోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



గుంతలతో అధ్వానంగా మారిన బీటీ రోడ్డు

తిర్యాణి: మండలంలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట గుంతల రోడ్లపై రాకపోకలు సాగించాలంటే జనం జంకుతున్నారు. మండలంలోని చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని శ్రీ ఇంక్లైన్ వైపు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ సరైనా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రోడ్డంతా అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక రాత్రి వేళలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అడుగడుగునా గుంతలు..

మండలంలోని మొర్రిగూడ స్టేజి నుంచి మొదలుకొని అరటిపెల్లి స్టేజి వరకు రోడ్డుపై అడుగు అడుగున పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కాలం ఏదైనా వాన పడితే గుంతలు వరదతో నిండి ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మండల కేంద్రం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్తుంటారు. రహదారి ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లపై నిత్యం ప్రయాణాలు సాగించటం ద్వారా వెన్నుపూస, నడుంనొప్పి వంటి సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

స్పందించకుంటే ఆందోళనలు



చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి మొర్రిగూడ స్టేజి వరకు రోడ్డుపై గుంతలు ఉన్నాయి. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. అత్యవసర సమయంలో రోడ్డుపై ప్రయాణం సాహసంగా మారింది. అధికారులు స్పందించకుంటే త్వరలో ఆందోళనలు చేస్తాం.
– వెద్మ భగవంత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు

సృజనాత్మకత వెలికితీసేందుకే శిక్షణ

ఆదిలాబాద్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడుతాయని కవి ఉదారి నారాయణ అన్నారు. గిరి విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో అడవి మల్లెలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన గీతాలు అలరించాయి. పది రోజుల నుంచి విద్యార్థులకు దేశభక్తి, సామాజిక కవితలు, పాటలు, కథలు నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మినారాయణ, ట్యూటర్ జాదవ్ అశోక్, రేడియో స్టేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం మహాపూజలో భాగంగా యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా సాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.